డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలి

కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

మాట్లాడుతున్న కొండూరు రవీందర్‌రావు, చిత్రంలో తోట ఆగయ్య, జిందం చక్రపాణి

సిరిసిల్ల టౌన్, జనవరి 13 : కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ మానుకోవాలని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు హితవుపలికారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నలభై ఏండ్ల తన రాజకీయ జీవితంలో ఇలాంటి పాలన చూడలేదని తెలిపారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉండేవని, ఆ తర్వాత స్నేహపూరిత వాతావరణంలో పనిచేసేదని గుర్తు చేశారు. కరీంనగర్‌లో జరిగిన అధికారిక సమావేశానికి తనకు ఆహ్వానం అందించక పోవడంలో ఆంతర్యం అర్థం కావడంలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన చాలా బాధాకరంగా ఉందన్నారు. గత పదేండ్లలో కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేశామన్నారు. ప్రస్తుతం అధికార పార్టీ నాయకులకు తప్ప ఇతరులకు ఎలాంటి పనులూ జరగడం లేదన్నారు. పలు నియోజకవర్గాల్లో ఎలాంటి పదవులు లేని వారికి కూడా నిధులు ఇస్తూ వారి ద్వారానే ప్రారంభోత్సవాలు చేస్తున్నారన్నారు. అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరించడం మానుకోవాలని హితవుపలికారు. ఎన్నికలై ఏడాది గడిచినా ఒక్క హామీని అమలుచేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ ఎరువుల సమస్య చూడలేదని, ఇప్పుడు తన సొంత ఊళ్లోనే ఇతర ప్రాంతాలకు చెందిన వారు లారీలలో వచ్చి ఎరువులు విక్రయిస్తున్నారని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి మాట్లాడుతూ ప్రజా పాలన పేరుతో దుర్మార్గమైన పాలన చేస్తున్నారని విమర్శించారు. అధికారులు సైతం బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేసే విధంగా వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. 2007లో తెచ్చిన పీవోటీ చట్టం ప్రకారమే భూములు పట్టాలు చేసుకున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల పేర్లతో తయారు చేసిన లిస్ట్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నరని, బండి దేవదాస్, కోడి అంతయ్యను పోలీసులు అరెస్ట్ చేసిన విధానం దురదృష్టకరమని విమర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మీద కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేసీఆర్ దయతో గెలిచిన సంజయ్‌కుమార్ పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మ్యాన రవి, సత్తార్, గుండ్లపల్లి పూర్ణచందర్, వెంగళ శ్రీనివాస్, కుంబాల మల్లారెడ్డి, గుగులోతు సురేశ్‌నాయక్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

బాధిత కుటుంబానికి విరాళం అందిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 13 : గత వారం రోజుల క్రితం దుమాలకు చెందిన కానాపురం రాజు ముంబాయ్‌లో ప్రమాదవశాత్తు భవన నిర్మాణంలో పని చేస్తూ కింద పడి మృతి చెందగా, సదరు బాధిత కుటుంబానికి గ్రామస్తులు నగదు సాయం అందజేశారు. సోమవారం గ్రామస్తులు విరాళాలు సేకరించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, భరోసాగా రూ. 45 వేలు ఆ కుటుంబానికి అందజేశారు. ఇక్కడ కదిరె శ్రీనివాస్, కొలనూరి శంకర్, సోమారపు శరవింద్, అందె చంద్రయ్య ఉన్నారు.

సాగు కళ .. ఉపాధి భళా..

ఇతర రాష్ట్రాల కూలీలకు తెలంగాణలో ఉపాధి

నర్సింగాపూర్‌లో వరి నాటు వేస్తున్న మహారాష్ట్ర కూలీలు

చందుర్తి, జనవరి 13 : ఓడలు బండ్లవుతాయ్.. బండ్లు ఓడలవుతాయి అన్న నానుడిని నిజం చేస్తున్నాయి నేడు మనం చూస్తున్న చిత్రాలు.. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంత కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పంటలకు సాగునీరు పుష్కలంగా లభిస్తోంది. మండల వ్యాప్తంగా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతో రైతులు వరి తదితర పంటలను ఎక్కువ సాగు చేస్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ స్థిరీకరణలో భాగంగా ఉచిత విద్యుత్, పంటలకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు మెట్ట ప్రాంతమైన చందుర్తి మండలానికి గోదావరి జలాలను అందించి, వ్యవసాయాన్ని పండగ చేసింది. గత పదేళ్ల నుంచి రైతులు వరితో పాటు ఆరుతడి పంటల సాగు చేస్తూ ఆదర్శంగా నిలుసున్నారు. కూలీల కొరత ఏర్పడడంతో ఇతర రాష్ట్రాల కూలీల సైతం వలస వస్తున్నారు. నెల రోజుల క్రితం మహారాష్ట్రలోని గచ్చిరోలి, చంద్రాపూర్, బీహార్ రాష్ట్ర నుంచి 50 మంది మహిళా పురుష కూలీలు 15 నుంచి 18 మంది చొప్పున మూడు గ్రూపులుగా ఏర్పడి మండలకేంద్రంతో పాటు నర్సింగాపూర్, మల్యాల, తిమ్మాపూర్ గ్రామాల్లో ఉంటున్నారు. కొందరు రైతులు కూలీలకు తాత్కాలిక వసతి కల్పించడంతో అక్కడే ఉంటూ ఉదయమే పనులకు వెళ్తున్నారు. ఎకరం చొప్పున గుత్తగా తీసుకొని నారు తీయడం మొదలు.. నాట్లు వేయడం వరకు పొలంలో నారు పంచడం ఇతరత్రా పనులన్నీ వారే చేస్తున్నారు. పోలం విస్తీర్ణలో స్పష్టత కోసం కూలీలు జీపీఎస్ ఏరియా మేనేజర్ క్యాలిక్యులేటర్ వంటి యాప్‌ను వినియోగిస్తున్నారు. సాంకేతికతను వినియోగించడం ద్వారా ఇటు రైతులకు కూలీలకు స్పష్టత ఉంటుంది. ఎకరాకు 5000 చొప్పున గుత్తా మాట్లాడుకొని వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు.

మూడేళ్ల సంది వస్తున్నాం..

తెలంగాణలో మస్తు పని ఉన్నది. గత సీఎం కేసీఆర్ దయతో ఇక్కడి రైతులకు నీళ్లు బాగా ఉన్నాయి. రైతులు సంతోషంగా ఉన్నారు. మంచిగా ఎవుసం చేసుకుంటున్నారు. మా చంద్రపూర్‌లో ఇవన్నీ లేవు. చేద్దామంటే పని లేదు. అందుకే మేము మూడేళ్ల సంది పంటల సీజన్ల చందుర్తి మండలానికి వస్తున్నాం. వరి నాట్లు గుత్త పట్టుకొని వేస్తున్నాం. ఈ సారి 50 మంది ఆడోళ్లు, మొగోళ్లు వచ్చినాం. చేతినిండా పని ఉంది వరి నాట్లు వేస్తున్నాం. ఇన్ని పైసలు వెనుక చేసుకుంటున్నాం.

-వనిత , గొల్లవర్, చంద్రాపూర్ జిల్లా ,మహారాష్ట్ర

మాకు ఇంత అన్నం పెడుతుంది తెలంగాణనే

నా పేరు విద్య కోహడే గచ్చిరోలి, మాది మహారాష్ట్ర మా దగ్గర పని లేదు. తెలంగాణలో పుష్కలంగా నీళ్లు ఉండి వ్యవసాయం మంచిగా సాగుతున్నది. చేతినిండా పని దొరుకుతున్నదని తెలుసుకొని ఇక్కడికి వచ్చినాం. సీజన్ల మంచి పని దొరుకుతున్నది. ఇక్కడ ఆడవాళ్లు నాట్లు వేస్తారు. కాని, మా దగ్గర మగవాళ్లు, ఆడవాళ్లు నాట్లు వేస్తుంటారు. అనుభవంతోనే ఇక్కడ చక చకా పని పూర్తి చేస్తున్నం. మంచి కూలీ దక్కుతుంది. మాకు ఇంత అన్నం పెడుతుంది తెలంగాణననే.

- విద్య , కోహెడే,గచ్చిరోలి జిల్లా ,మహారాష్ట్ర

మాట్లాడుతున్న టౌన్ సీఐ కృష్ణ

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఐ కృష

తెలంగాణ చౌక్, జనవరి 13 : ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వారి మాటలు నమ్మి అమయాకప్రజలు మోసపోతున్నారని అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ కృష్ణ సూచించారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో మీ కోసం కార్యక్రమంలో భాగంగా సామాజిక అంశాలపై అవగాహన కల్పించి, మాట్లాడారు. నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఎవ్వరైనా మోసపోయినట్లయితే వెంటనే 1930కి కాల్ చేసి, సమాచారం అందజేయాలని సూచించారు. ట్రాఫిక్, గల్ఫ్ ఏజెంట్ల మోసాలు, మహిళా చట్టాలపై, సీసీ కెమెరాల యొక్క అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి ద్వారా ఎలాంటి సంఘటనైన గుర్తించవచ్చునని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కి కాల్ చేయాలని తెలిపారు.

వైభవంగా గోదారంగనాథ స్వామి కల్యాణం

కోనరావుపేట : ఆలయంలో గోదారంగనాథ స్వామి కల్యాణ మహోత్సవంను జరిపిస్తున్న అర్చక బృందం, పాల్గొన్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

గంభీరావుపేట/చందురి/వేములవాడ రూరల్/ఇల్లంతకుంట/కోనరావుపేట, జనవరి 13 : మండలంలోని మల్కపేట గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీగోదారంగనాథ స్వామి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కల్యాణ తంతుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై కనులారా వీక్షించారు. అనంతరం వెంట తెచ్చుకున్న కట్నాకానుకలు, ఓడి బియ్యంను స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కల్యాణోత్సవంలో వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, సునీల దంపతులు పాల్గొన్నారు. ఇల్లంతకుంట మండలంలోని ముస్కానిపేటలోని లక్ష్మీ నర్సింహాస్వామి ఆల యంలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేములవాడ పట్టణంలోని నాంపెల్లి గుట్ట పైన శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో, చందుర్తి మండలంలోని మల్యాల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ గోదా దేవి రంగనాథ స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. గంభీరావుపేట మండలకేంద్రంలోని సీతారామాలయంలో గోదాదేవి-రంగనాథ స్వామి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించారు.


గుండారంలో ఎరువుల కోసం రైతులు తమ వరుసలో పెట్టిన ఆధార్‌కార్డులు

ఎరువుల కోసం 'ఆధార్' లైన్..

ఎల్లారెడ్డిపేట, జనవరి 13 : 350 ఇండ్లు, 600 ఎకరాలు 163 మంది రైతులున్న ఓ చిన్న గ్రామంలో ఎరువుల కోసం పదేండ్లలో లేనిది ఇప్పుడే పరేషానేందని రైతులు ఎరువుల కోసం ఆధార్‌కార్డులను లైన్లో పెట్టి ఎదురు చూస్తున్న ఘటన సోమవారం కనిపించింది. మండలంలోని గుండారంలోని పంచాయతీలో ఒక రైతుకు రెండు బస్తాలు ఇచ్చే నిబంధనతో ఆదేశాలున్నప్పటికీ రైతులు ఉదయమే వచ్చి ఎరువుల బస్తాల కోసం క్యూ లైన్లో నిలబడ్డారు. కొద్ది సేపటికీ రైతులు తమ ఆధార్ కార్డులను వరుసలో పెట్టాలని అక్కడున్న పంచాయతీ సిబ్బంది చెప్పడంతో రైతుల తమ ఆధార్ కార్డులను వరుసలో పెట్టి టోకెన్లు తీసుకున్నారు. కొన్నేండ్లుగా లేని ఇబ్బందులు ఇప్పుడెందుకని రైతులు అసహనం వ్యక్తం చేశారు.

క్రీడలతోనే మానసిక, శారీరక ఉల్లాసం

షెటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ, ఎస్ఐ, నాయకులు

రుద్రంగి, జనవరి 13 : క్రీడలతోనే మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని సీఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఫిట్నెస్ ఫ్రిక్ బ్యాడ్మింటన్ క్లబ్ గ్రౌండులో మండల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన షెటిల్ టోర్నమెంట్‌ను సీఐ వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు విద్య, క్రీడతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రీడల వల్ల క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. యువత క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో క్రీడలను ప్రోత్సహించడం కోసం మరిన్ని టోర్నమెంట్‌లు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, ఫిట్నెస్ ఫ్రిక్ బ్యాడ్మింటన్ క్లబ్ క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోయినపల్లి, జనవరి 13 : క్రీడలు మాన సికోల్లాసాన్ని ఇస్తాయని మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సూచించారు. సోమవారం కోరెంలో కోరెంకు చెందిన క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికె ట్ పోటీలు క్లబ్ నిర్వాహకులు నిర్వాహించారు. ఈ పోటీల్లో ఆరు టీంలు పాల్గొని క్రికెట్ ఆడగా, ప్రథమ, ద్వితీయ టీంలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హాజరైన నాయకులు మాట్లాడుతూ, కోరెంలో కొన్నేళ్లుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా యు వకులు క్లబ్ నిర్వాహకులు ఐక్యంగా ఉండి ఏ టా నిర్వహించుకోవాలని సూచించారు. క్లబ్ నిర్వాహకులు బుర్ర శివ, గాజర్ల బాలుతో పాటు రెడ్డి సంఘం, గౌడ సంఘం నాయకులు, మాజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబురాలు

మహిళలకు బహుమతులు అందజేస్తున్న రాష్ట్ర యూనియన్ కోపరేటివ్ చైర్మన్, నాయకులు

రుద్రంగి, జనవరి 13 : మండలంలోని మానాల గ్రామంలో ముందస్తూ సంక్రాంతి సంబురాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మానాల గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర యూనియన్ కోపరేటీవ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు వాళ్ల సంస్కృతి సంప్రదాయాల్లో ఈ పండుగలు ఒక భాగమన్నారు. ఈ సంక్రాంతి పండుగ మండలంలోని రైతులు, మహిళలు, కార్మికులు ప్రజలంతా అష్ట ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఎస్ఐ అశోక్, మాజీ వైస్ ఎంపీపీ పీసరి భూమయ్య, మాజీ సర్పంచ్ అల్లూరి మానస పాల్గొన్నారు.

రాజన్న నిత్యాన్నదాన సత్రంకు మంత్రి విరాళం

ప్రభుత్వవిప్‌తో కలిసి రాజన్నను దర్శించుకున్న పొన్నం ప్రభాకర్

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడటౌన్, జనవరి 13 : రాజన్న నిత్యాన్నదాన సత్రంకు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ రూ. 45 లక్షల విరాళం అందజేశారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం వేములవాడ రాజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి, కోడె మొక్కు చెల్లించుకున్నారు. అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి మంత్రికి స్వామి వారి ప్రసాదం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజన్న కోవెలలో నిత్యాన్న సత్రం ఏర్పాటు చేయాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమన్నారు. తాను విప్ ఆదిశ్రీనివాస్‌లు కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చేసిన విజ్ఞప్తికి స్పందించి, రూ. 35 కోట్లు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నిత్యాన్నదాన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, దాతలు పెద్ద ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఏర్పాట్ల విషయమై అన్ని శాఖల అధికారులతో విప్ ఆది శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించి, దిశానిరేద్దశం చేశారన్నారు. శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వేములవాడ, జగిత్యాల జిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రాలకు ఏసీ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. వేములవాడ బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

ముస్తాబాద్, జనవరి 13: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశామని ఎస్ఐ గణేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దికుంట రోడ్డులో పోలీసు సిబ్బందితో వెహికల్ చెకింగ్ చేస్తుండగా, మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతున్న వారిని పరీక్షించి, కేసు నమోదు చేశామన్నారు.

జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధం

ఇల్లంతకుంట, జనవరి 13 : మండలంలోని జంగంరెడ్డి పల్లి గ్రామంలో మూడు రోజుల పాటు జరిగే రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశామని, ఆలయ కమిటీ సభ్యుడు సోమవారం పేర్కొన్నారు. ఈ జాతర ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ జాతర ఉత్సవాలకు 10వేల మంది భక్తులకు ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

గంభీరావుపేట, జనవరి 13 : మండలంలోని కొత్తపల్లి శివారులో ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 100 కిలోల పీడీఎస్ బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నామని ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పెట్రోలింగ్ చేస్తుండగా, ద్విచక్రవాహనంపై పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు.

చందాలతో అంత్యక్రియలు

గంభీరావుపేట, జనవరి 13 : మండల కేంద్రంలోని బరిగెల గూడెం కాలనీకి చెందిన గ్యార పద్మ (36) అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం స్థానికులు చందాలు వేసుకొని, అంత్యక్రియలు నిర్వహించారు. పేద కుటుంబానికి చెందిన పద్మ భర్త గతేడాది రోడ్డు ప్రమాదంలో గాయపడగా, 7 సంవత్సరాల పెద్ద కొడుకు నితీష్ మూగ, 5 నెలల చిన్న కొడుకు అభిరామ్ గుండెలో రంధ్రం సంబంధిత ఆనారోగ్య సమస్యతో బాధపడుతున్న బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుల బాంధవులు, స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

వీర్నపల్లి, జనవరి 13: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలోని రంగంపేట శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వన్‌పల్లికి చెందిన కుమ్మరి బాబు బైక్ పై వీర్నపల్లి వస్తున్నాడు. మార్గమధ్యంలో రంగంపేట మార్గండి చెరువు మూలమలుపు వద్ద అదుపు తప్పి కిందపడగా గాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న బాబుకు 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసిన ఆనంతరం ఇంటికి తరలించారు. సంఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది.

నిత్యావసరాలు అందజేత

తిమ్మాపూర్, జనవరి 13: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో ఆదివారం కెనాల్‌కు గండితో ఇబ్బంది పడిన గ్రామస్తులకు ప్రభుత్వం నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆదేశాలతో 30 కుటుంబాలకు పది కిలోల చొప్పున బియ్యంతో పాటు నూనె, పప్పులను స్థానిక నాయకులతో కలిసి ఆర్ఐ అందజేశారు. సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, కనకయ్య, శ్రీనివాస్, పార్నంది దుర్గయ్య, కిరణ్, పొట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోనేరులోకి గోదావరి నీళ్లు

ధర్మపురి, జనవరి 13: బ్రహ్మపురిణి (కోనేరు)లోకి సోమవారం గోదావరి నీటిని నింపారు. పట్టణంలో భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు గోదావరి నుంచి పైప్ లైన్, మో టర్లు ఏర్పాటు చేసి కోనేరును గోదావరి నీటితో నింపినట్లు చైర్‌పర్సన్ సత్తెమ్మ తెలిపారు. కోనేరుతో పాటు చింతామణి చెరువును కూడా గోదావరి నీటితో నింపనున్నట్లు చెప్పారు. ఇక్కడ వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు కిరణ్మయి, కార్తీక్, నాయకులు దినేశ్, వేముల రాజేశ్, లక్ష్మ ణ్, సీహెచ్ రాజేశ్ ఉన్నారు.

బాలుడికి తీవ్ర గాయాలు

కోరుట్ల, జనవరి 13: పట్టణంలోని జవహర్ రోడ్డులో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి సోమవారం బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక జవహర్ రోడ్డులోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్న రాజు-లావణ్య దంపతుల కొడుకు ఆర్యన్ (6) సోమవారం ఉదయం దాబాపైకి ఎక్కుతుండగా.. పక్కనే ఉన్న విద్యు త్ తీగలకు ప్రమాదవశాత్తు చేయి తగలడంతో షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స అందించారు.

పోలీసు నిర్బంధం

పాడి కౌషిక్ రెడ్డి కలిసేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అడ్డగింత

కొదురుపాక బ్రిడ్జిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 13: పాడి కౌషిక్ రెడ్డిని హైదరాబాద్‌లో అరెస్టు చేసి, కరీంనగర్ తీసుకెళ్తున్నట్లు తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఇతర నాయకులను కొదురుపాక బ్రిడ్జి వద్ద అదుపులోకి తీసుకున్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. కరీంనగర్ వెల్లవద్దంటూ పోలీసులు నిర్బంధం విధించడంపై ఆగయ్య అసహనం వ్యక్తం చేశారు. ఆయనతో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, నాయకులు అందె సుభాశ్, కుంబాల మల్లారెడ్డి, చందనం శివ, దొనుకుల కల్యాణ్ తదితరులు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ఉదయ్‌కుమార్

ధర్మపురి రూరల్, జనవరి13: రాయపట్నంలో ఆదివారం రాత్రి ఇద్దరిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ నిందితుడు లెక్కల శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాయపట్నం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కోసరి సత్తయ్య, అతడికి వరుసకు అల్లుడైన లెక్కల శ్రీనివాస్ ఆదివారం రాత్రి గ్రామ పంచాయ తీ వద్ద గల ఖాళీ స్థలంలో మద్యం తాగారు. మద్యం తాగుతున్నప్పుడు ఇద్దరికీ చిన్నగా గొడవ జరిగింది. అది మనసులో పెట్టుకున్న శ్రీనివాస్ అదే రాత్రి ఇం టికెళ్లి రెండు కత్తులను తీసుకొని కోసరి సత్త య్య ఇంటికి వెళ్లి అతడిపై దాడి చేశాడు. సత్త య్య కొడుకు రాకేశ్ అడ్డుపడగా, అతడిపై కూడా శ్రీనివాస్ కత్తులతో దాడి చేశాడు. ఈ దాడిలో గాయపడిన తండ్రీకొడుకులను జగిత్యాల దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నారు. రాకేశ్ భార్య దివ్య ఫిర్యాదు మేరకు లెక్కల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొన్నారు. శ్రీనివా స్ ఉపయోగించిన రెండు కత్తులను స్వాదీనం చేసుకొని, అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు..

మహా సభలను విజయవంతం చేయాలి

కోరుట్ల, జనవరి 13: బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి, ఏఐటీయూసీ బీడీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో కోరుట్ల డివిజన్ స్థాయి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మహా సభల కరపత్రాలను ఆవిష్కరించి, మాట్లాడా రు. బీడీ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, నెలలో 26రోజుల పని దినాలు కల్పించాలన్నారు. బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న కోరుట్లలో భారీ ప్రదర్శన, 31న రాష్ట్ర మహా సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీడీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశం లో నాయకులు గోవర్ధన్, మౌలానా, ము క్రం, ఖాసీం, అనసూయ, శాంత, గోదావ రి, వేణు, లక్ష్మణ్, భిక్షపతి, సదానంద గౌడ్, భానుచందర్, విలాస్ పాల్గొన్నారు.